# నిప్పులాంటి నిజం

కాపరానికి వచ్చిన నాలుగయిదు నెలల్లోనే జీవిత మంటే మొహం మొత్తింది అనసూయకు. మునపటి ఆ చలాకీ, ఆ చురుకుదనం, ఆ ఉత్సాహం అన్నీ ఆమెలో మాయమైనాయి. ఎప్పుడూ ఈసురోమని ఉండేది. ఆలోచనల అడకత్తెరలో నలిగి నల్లేరవుతున్నట్లు కనిపించేది. కారుమబ్బులు క్రమ్మిన ఆకాశాన్ని ఆమె ముఖం గుర్తుచేసేది.

అనసూయలో మోదానికి బదులు ఖేదం, అనురాగానికి బదులు అసహ్యం గూడు కట్టుకొని వుండడం గమనించక పోలేదు, ఆమెను అగ్ని సాక్షిగా అర్ధాంగిగా చేసుకున్న భర్త అచ్యుతరావు.

కాపరానికి వచ్చిన తొలిరోజులలో ప్రతి యువతికి లజ్జ వుండడం సహజమనుకున్నాడు అచ్యుతరావు. సముచితమూ సహజమూ అయిన లజ్జ మధురానుభూతులకు ఆలవాలమనుకుని తృప్తిపడ్డాడు. కాని తన భార్యలో అసహ్యం, ఖేదం కనిపించేసరికి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. తన ఆశా సౌధాలన్నీ ఒక్కసారిగా కూలిపోయినవాడిలా కుమిలిపోయాడు. కొండంత బరువు యేదో తన తలమీద తిష్ఠ వేసినట్లు బాధ పడ్డాడు.

అనసూయకు వచ్చిన కష్టమేమిటి? ఏం తక్కువయిందని? తనకు నాలుగు వేల రూపాయల జీతం నెలకు. మూడెకరాల మాగాణి సుక్షేత్రం, డాబాయిల్లూ ఉన్నాయి. పంచుకునే వారెవ్వరూ లేరు. ఉన్న ఒక్క చెల్లెలికీ పెళ్ళయింది. సమస్య లేమీ లేవు. ఈ విషయాల్లో చాలామందికంటె తాను అదృష్టవంతుడు. ఇంటి పనులన్నీ అమ్మ చూసుకుంటోంది. అనసూయకేం తక్కువయినట్టు? అయితే ప్రొద్దస్తమానం ఎందుకలా కుమిలి పోతోంది? ఎప్పుడు చూసినా యెందుకలా ఆలోచిస్తూ కూర్చుంటుంది? మథనపడ సాగాడు అచ్యుతరావు. కారణం మాత్రం అంతు చిక్కలేదు.

ఒకనాటి సాయంకాలం కాలేజీ నుంచి వస్తూనే ''అనూ యివాళ మనం బీచికి వెళదాం'' అన్నాడు ఉత్సాహంగా. అనసూయకు అతను పెట్టిన ముద్దుపేరు అను.

తలవని పలంపుగా వచ్చిన ఆహ్వానానికి అనసూయ కొంచెం ఆశ్చర్య పోయింది.

''రేపు వెళదాం లెండి'', నీరసంగా జవాబు చెప్పింది.

అచ్యుతరావు ఉత్సాహపు పొంగుమీద నీళ్ళు పోసినట్టయింది. ఆ నిరుత్సాహాన్ని కప్పి పుచ్చుకుని తెచ్చుకున్న సంతోషంతో, ''రేపే మన్నా మంచిరోజా'' వెటకారం ధ్వనించేలా అడిగాడు.

వెటకారాన్ని అనసూయ గ్రహించక పోలేదు. భర్త నిరుత్సాహం చెందడం కూడా గమనించింది.

''వాడలా అడుగుతూంటే ఎందుకమ్మా వెళ్ళనంటావ్'' ఇది అత్తగారి మందలింపు.

అనసూయ జవాబు చెప్పాలని నోరు తెరిచింది. ''నీ ముష్టిజవాబు ఎవడిక్కావాలే''? అన్నట్టుగా చూస్తూ అత్తగారు ''పెళ్ళినాడు ఒక్క ముద్దూ ముచ్చటా జరగలేదు వాడికి. మళ్ళీ మళ్ళీ జరిగే కార్యాలాయివి. అంతమాత్రం మీ వాళ్ళకి తోచక్కర్లేదూ? నువ్వుమాత్రం ఆ తానులో గుడ్డవి కావూ...అందుకనే నోరు విడిచి వాడలా అడుగుతున్నా నువ్వు కాదన గలిగావు...ముద్దూ ముచ్చటా తీరే యోగం వాడి జాతకంలో అసలువుందో లేదో...యేవిఁటో చేసుకున్న ఖర్మ!'' అంటూ వంటింటిలోకి వెళ్ళిపోయింది.

మొదలు నరిగిన తరువులా కూలిపోయింది అనసూయ. ముఖంలో నెత్తురు చుక్కలేదు. నేలమీద చూపు నిలిపింది. కళ్ళు చెమ్మగిల్లాయి. మనస్సు మనస్సులో లేదు.

పాతబడుతున్న విషయాలను తల్లి గుర్తు చేయడం నచ్చలేదు అచ్యుతరావుకి. వాటి నతడు మరచిపోయాడు. మాట పట్టింపులూ అవీ లేకుండా ఏ పెళ్ళి జరిగిందని అనుకున్నాడు మనస్సులో. పైగా అనసూయ నిస్సహాయతనూ దైన్యాన్ని చూసి సహించలేక పోయాడు అచ్యుతరావు. కొంచెం కటువుగా మాట్లాడినందుకు తల్లిమీద కోపం తెచ్చుకున్నాడు.

''అనూ'' ప్రేమగా పిలిచాడు.

అతి కష్టంమీద అనసూయ బదులు చెప్పింది. ''ఏమండి!'' ముఖం పై కెత్తింది భర్త కళ్ళల్లోకి సూటిగా చూసింది. ఆమె కళ్ళునీటి బుంగలవలె ఉన్నాయి.

''పెళ్ళినాడు మీ రనుకున్నట్టుగా వేడుకలూ అవీ జరగని మాట నిజమేనండి.''

''ఆ బాధ నాకు లేనప్పుడు మధ్య నువ్వెందుకు బాధపడాలి, ఊరుకో'' ఓదార్చాడు భర్త.

''మీ రనుకున్నంత ధనికులు కారండి మా వాళ్ళు...''

''మా అమ్మ యేదో అందని, చదువుకున్న నువ్వూ ఆ మాటల్ని పట్టుకొని వూగులాడుతా వెందుకు చెప్పు?''

''అత్తయ్య నిజమే చెప్పారు.''

''అబ్బా-నీకు పుణ్యముంటుందిగాని యింకెప్పుడూ ఆ మాటెత్తకు'' అన్నాడు అచ్యుతరావు విసుగ్గా.

అనసూయ మాట్లాడలేదు. కాని తన మనసులోని మాటను ఎలాగైనా బయట పెట్టాలని ఉబలాట పడింది.

''ఇదిగో అనూ! అమ్మ పెద్దది. పూర్వ కాలపుది. ఏదో అంటూవుంటుంది. ఆవిడ మాటల్ని నువ్వూ అంతగా పట్టించుకోవడం నా కిష్టంలేదు. నువ్వు బాధపడడం, ఆ తర్వాత నేను బాధపడడం-ఎందుకిదంతాను.'' ఏడ్చే కుర్రాణ్ణి ఓదారుస్తున్న తల్లిలా చెపుతున్నాడు అచ్యుతరావు.

''అవున్నాయనా - నా మాటలు దానికే బాధగా వున్నాయనుకున్నా - ఇప్పుడు నీకూ బాధగా వున్నాయి.

ఏవిటో పిచ్చిబొందనునేను - కాకపోతే, అడ్డాలనాడు బిడ్డలుగాని..'' అంటూ అచ్యుతరావుని సమీపించింది తల్లి. ''ఏమిటమ్మా ఆ మాటలూ నువ్వూను. ఇప్పుడు నిన్నే మన్నానని?''

''అన్నది చాలదూ! నా మాటల వల్ల మీరంతా బాధ పడ్డందేనికి? మీ ఇద్దరికీ నేను భారంగా వుంటే నేను మా చెల్లెలు గారింటికి వెడతాను.

ఇక్కడ చేసే చాకిరి అక్కడ చేస్తే అది సంతోషిస్తుంది. అసలే అది రోగిష్టిది. అందులోను గంపెడు సంసారం'' అంటూ దండకం మొదలు పెట్టింది.

అచ్యుతరావు పైకి యేమీ మాట్లాడ లేదు కాని లోలోపల గొణుక్కున్నాడు.

అనసూయ కాపరానికి వచ్చిన నాలుగయిదు నెలల్లో ఇలాంటి సంఘటన జరగడం యిదే తొలిసారి. తల్లంటే తన భర్తకు మహాగౌరవం! కొడుకంటే ఆ తల్లికీ ఎక్కడలేని అభిమానం! వాళ్ళిద్దర్నీ చూసి ఎంతగానో మురిసిపోయింది అనసూయ. తల్లీ కొడుకులు పెళ్ళయిన తర్వాత అలా వుండాలనుకుంది. కాని యివాళ అకారణంగా ఆ తల్లికొడుకులు ఘర్షణ పడడం చూసి అనసూయ మొదట ఆశ్చర్య పడింది. తరువాత విచారించింది.

''రేపు దశమి. రేపే నా ప్రయాణం'' అంది అచ్యుతరావు తల్లి.

అతను ఇక మౌనంగా ఉండలేక పోయాడు.

''అమ్మా నీ కేమన్నా మతి పోయిందా యేమిటి? యెవరన్నా వింటే నవ్వుతారు కూడా!''

''ఎందుకురా నవ్వుతారు? నా చెల్లెలింటికి నేను వెడుతున్నాను. అదేమన్నా పరాయిది కనకనా?''

''అవును – నేను పరాయివాణ్ని.'' అచ్యుతరావు మాటలో కసితోపాటు బాధ కూడా తొంగిచూసింది.

''అత్తయ్యా! తప్పంతా నాది క్షమించండి'' అంది అనసూయ. భర్త మానసికంగా పడుతున్న బాధను పసిగట్టి.

''ఇంతకూ తప్పునాది. ఎందుకు నిన్ను బీచికి రమ్మని పిలవాలి? లేదని యెందు కనిపించుకోవాలి?'' అంటూ అచ్యుతరావు చరచరా తన గదిలోకి వెళ్ళాడు.

''తప్పంతా నాదేనమ్మా – నేను బతికుండడం వచ్చింది తిప్పలు. తెలీక అడుగుతున్నా – ఈ మాత్రానికే యింత కోపం రావాలిట్రా? ఇంతకూ నేనే వన్నానని? నా చెల్లెలింటికి నేను వెళ్ళ కూడదా?''

గదిలోంచి అచ్యుతరావు ఒక్క పొలి కేక పెట్టాడు. ''అంతా కలసి నా ప్రాణాలు తియ్యండి.''

ఇక అక్కడ నిలవలేక పోయింది అనసూయ. భర్త గదిలోకి వెళ్ళింది.

''అబ్బాయి యెందుకో యివాళ కోపంగా వున్నాడు'' అనుకుంటూ అచ్యుతరావు తల్లి లోపలికి వెళ్ళింది.

అచ్యుతరావు మంచంమీద కూర్చుని యెదురుగా వున్న కిటికీ వంక అదే పనిగా చూస్తున్నాడు.

మంచం దగ్గరికి వెళ్ళి భర్త పక్కగా నిలబడింది అనసూయ. ఆమె రాకను చూసీ చూడనట్టు నటించాడు. అతనేమీ మాట్లాడలేదు.

''బీచికి వెడదాం రండి'' ధైర్యం కూడ గట్టుకొని నవ్వుతూ అంది అనసూయ.

''ఎందుకు?''

''ఊరికే అలా వెళ్ళి వద్దామనిస్తోంది''

''ఏమీ అక్కరలేదు.''

కొంచెం సేపాగి అచ్యుతరావు ''కావాలంటే నువ్వు వెళ్ళు. నా కివాళ మనస్సేం బాగాలేదు'' అన్నాడు.

''మీరు లేకుండానా?''

''ఏంఆ రోజు వెళ్ళావుగా డాక్టరుగారి దగ్గరికి. అప్పుడు లేని తోడు యిప్పుడు కావలసి వచ్చిందా?''

అచ్యుతరావు మాటలో కటుత్వం మూర్తీభవించింది.

డాక్టరనగానే అనసూయ వణికిపోయింది. కాళ్ళ క్రింద నేల కదిలినట్లనిపించింది. ఏమీ మాట్లాడలేదు. మంచం చివరవున్న చాపమీద చతికిల బడింది. ఆలోచనలలో మునిగిపోయింది.

క్రితం క్షణం నవ్వుతూ మాటలాడిన అనసూయ వున్నట్టుండి యిలా అయిపోవడం చూసి అచ్యుతరావు మొదట్లో నిర్ఘాంతపోయాడు. ఆ తర్వాత కొంచెం భయపడ్డాడు.

ఆ రోజు లేడీ డాక్టర్ దగ్గరకు అనసూయ వెడుతుంటే అచ్యుతరావు ''ఎందుకు?'' అని అడిగితే ఆమె ''ఒంట్లో కులాసాగా లేదు.'' అని ముక్తసరిగా సమాధానం చెప్పింది.

డాక్టరు వద్దకు వెళ్ళివచ్చిన తర్వాత, అత్తగారు అడిగింది. ''డాక్టరమ్మ ఏం చెప్పిందే'' అని, ''మందులు రాసిచ్చింది'' అని అనసూయ బదులు పూర్తి చేసేంత లోపల ఆవిడ అంది. ''డాక్టరు వద్దకు వెడితే మందులు రాసివ్వక మరేం చేస్తుంది? యేం మందులో యేమిటో! ఇప్పటి నుంచీ మందులు తినడం మొదలుపెడితే యిక సంసారం సాగినట్లే'' అని తల్లి అనడం, భార్య తలవంచుకొని లోపలికి వెళ్ళడం చూసి, అచ్యుతరావు ఏమీ మాట్లాడలేదు. మాటలవల్ల అనవసరంగా యేం గొడవ జరుగుతుందో అని అతని భయం.

ఆ మరునాడు డాక్టరమ్మ యేం చెప్పిందీ భార్యను అతను అడుగుతూ వుండగా అప్పుడే తల్లి అక్కడికి రావడంతో ఆ సంగతి ప్రస్తావనకు రాలేదు. ఆ తర్వాత అచ్యుతరావు భార్యను అడగలేదు; ఆమె కూడా అతనితో ఆ సంగతి యేమీ చెప్పలేదు. అయితే భర్తతో అంటీ అంటకుండా సంచరించడం మొదలు పెట్టింది.

కాని యివాళ అచ్యుతరావు అనసూయను చూసి భయపడ్డాడు. డాక్టరమ్మయేదో చెప్పి వుండాలి. లేకపోతే డాక్టరమ్మ అనగానే అనసూయ యెందుకిలా అయిపోవాలి? ఆవిడ యేం చెప్పిందో! భార్యను ఈ విషయం చెప్పమని యెలా అడగడమా అని తటపటాయించాడు. చివరికి, ధైర్యం చేసి యిలా అడిగాడు.

''డాక్టరమ్మ అనగానే యెందుకలా వులిక్కి పడ్డావు?''

''కారణం వుండే!''

''ఏమిటది?''

''మీ మొదటి భార్యను ఎందుకు విడిచి పెట్టేశారు?''

ఉలిక్కి పడ్డాడు అచ్యుతరావు. ముఖంలో నెత్తురు చుక్కలేదు. మౌనం వహించక తప్పలేదు.

''మాట్లాడరేం'' అధికార స్వరంతో అడిగింది అనసూయ. ఒక్క క్షణం ఆగి మళ్ళీ అడిగింది.

''ఆమెలో ఏం లోపం వుందని విడిచిపెట్టారు?''

"చదువు లేదు. అందంలేదు. శీలం..."

"అభాండాలు వెయ్యకండి. ఇప్పటికే మీరు మూట కట్టుకున్న పాపం చాలు"

"ఇదంతా నీ కెవరు చెప్పారు? ఆ డాక్టరమ్మేనా?"

"డాక్టరమ్మకు యిదే పననుకున్నారా?"

"అయితే యెవరు చెప్పారు?"

"ఎవరు చెపితే యేం. అబద్ధం కాదు కదా?"

"ఏవిటా వాగుడు?" అరిచాడు అచ్యుతరావు.

ఆ అరుపుకి వంటింట్లో పని చూసుకొంటున్న అచ్యుతరావు తల్లి అక్కడికి వచ్చింది.

ఉన్నట్టుండి అనసూయను ఆవేశం ఆవహించింది.

"డాక్టరుగారి యింటినుంచి తిరిగి వస్తుంటే దారిలో తలవని తలంపుగా నా స్నేహితురాలు ఒకావెు కనిపించింది. ఆవెు వల్ల తెలుపుకున్నాను. మీరు మీ మొదటి భార్యను విడిచిపెట్టినట్టు--"

"అవునే--విడిచి పెట్టిన మాట నిజమే. వాళ్ళు యిస్తామన్న కట్నం ఇవ్వక మోసం చేశారు..."

"అందుకని అభమూ శుభమూ ఎరగని ఆ అమ్మాయిని మీ అబ్బాయి మోస చేశారు."

"వాళ్ళు చేసిన మోసానికి జరిగిన శాస్తి జరిగిందిలేవే--"

"ఆమె ఉసూరు మంటుంటేను-- అది మీ అబ్బాయికి క్షేమమను కున్నారా?" ఎవ్వరూ మాట్లాడలేదు.

"అయితే ఈ సంగతి మన పెళ్ళికి ముందు మీరెందుకు చెప్పలేదు? మిమ్మల్నే-" అని అడిగింది భర్తను.

"పొరపాటు చేశాను" అన్నాడు అచ్యుతరావు. భార్యవైపు నుంచి ముఖం పక్కకు తిప్పుకుంటూ.

"కనక యిప్పుడు నువ్వేమంటావ్?"

"మా అక్కయ్యను మొట్టమొదట మీరు తీసుకురండి. ఆమెతో మీ అబ్బాయిని కాపరం చేయమని చెప్పండి. ఇదే నా కోరిక."

''అనూ...'' అన్నాడు అచ్యుతరావు ఆదుర్దాగా.

''నాకు గుండె జబ్బనీ, నేను సంసారానికి పనికిరాననీ డాక్టరు చెప్పింది'' అంది అనసూయ నిర్వికారంగా.

ఇన్నాళ్ళుగా ఈసురోమని కనిపించిన ఆమె యిప్పుడు ఉత్సాహంగా కనిపించింది. ఆమె గుండెల్ని అణిచివేసిన బరువు యిప్పుడు దూదిపింజ అయింది. మనస్సు తేలిక పడింది. ఇన్నాళ్ల భర్తకు భయపడుతూ భయపడుతూ చూసిన ఆమె యిప్పుడు భర్త కళ్ళల్లోకి సూటిగా చూడగలిగింది. అంతవరకూ అధికారం చెలాయించిన అచ్యుతరావు దిష్టిబొమ్మలా బెల్లంకొట్టిన రాయిలా కనిపించాడు. అతని మనస్సు మేఘావృత మయింది!

తప్పుచేసిన దానిలా అత్తగారు ముఖం పెట్టింది. ఆవిడలోని అధికార స్వరం గాలి తీసిన కందుకమయింది. మనస్సు మనస్సులో లేదు.

నిప్పులాంటి నిజం బయట పడినందుకు దించిన తలను పైకెత్తలేదు అత్తగారు. నిప్పులాంటి నిజం భార్యకు తెలిసినందుకు కుమిలిపోయాడు అచ్యుతరావు.

నిప్పులాంటి నిజాన్ని తానే బయట పెట్టగలిగినందుకు ఎంతగానో ఎంతో సంతోషించింది అనసూయ.